సాక్షి
ఏలూరు

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



'లంపీ'తో అప్రమత్తం

పశువులకు లంపీ స్కిన్ వ్యాపిస్తుండటంతో శ్రీవారి దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. గోదానం, గోదత్తత పథకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. 8లో ▸



ఆధిపత్యం కోసమే హత్య

ఏలూరు రూరల్ కొమడవోలు ఇందిరమ్మ కాలనీలో ఇటీవల జరిగిన హత్య ఆధిపత్యం కోసమే జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఆరుగురిని అరెస్టు చేశారు. 8లో ▸



మన్యంలో ప్రకృతి సేద్యం

మన్యంలో ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. ఖరీఫ్‌లో 10వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. 8లో ▸

సరిహద్దుల్లో ఇసుక దందా

- కొవ్వూరు నుంచి భారీగా తెలంగాణకు అక్రమ రవాణా
- 3 రీచ్‌ల నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో డంపింగ్
- అక్కడ నుంచి లారీల్లో తెచ్చి చింతలపూడిలో విక్రయాలు
- 3 నెలలుగా యథేచ్ఛగా సాగుతున్న అక్రమ దందా
- రోజూ 90కు పైగా లారీల్లో సరిహద్దుకు రవాణా
- టీడీపీ నేతలే నిర్వాహకులు



చింతలపూడి మండలం అల్లిపల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక కొని.. ఏలూరు జిల్లా సరిహద్దు గ్రామాల్లో డంప్ చేస్తారు. రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటించి తెలంగాణాకు తీసుకెళ్తారు.. ఇలా రోజుకు ఏకంగా 90 లారీలకు పైగా ఇసుకను పొరుగు రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేసి భారీగా దండుకుంటున్నారు. టీడీపీ నేతలే నిర్వాహకులు కావడంతో అన్ని వ్యవస్థల సహకారం అందుతోంది. దీంతో గత మూడు నెలలుగా సరిహద్దులో ఇసుక దందా జోరుగా సాగుతోంది. గత వారంలో జల వ్యవధిలో చింతలపూడి పరిసర ప్రాంతాల్లో తెలంగాణకు అక్రమంగా రవాణా అవుతున్న 21 లారీలను గుర్తించి కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు. దీంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మూడు నెలలుగా వందల లారీలు ఒకే మార్గంలో ప్రయాణిస్తున్నా అధికారులు మౌనం వహించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్ళపూడి, అన్నదేవరపేటలోని ఇసుక రీచ్‌ల్లో వందల లారీల ఇసుకను లారీ యజమానులు కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా జంగారెడ్డిగూడెం నుంచి కొవ్వూరు మార్గంలో వందలాది లారీలు ఉన్నాయి. స్థానిక లారీ యజమానులు కొందరు అధికార పార్టీ నేతలుగా చలామణి అవుతున్నారు. ఈ క్రమంలో ఎవరికి అనుమానం రాకుండా సరికొత్త ఇసుక వ్యాపారానికి తెరతీశారు. కొవ్వూరు నియోజకవర్గంలోని రీచ్‌ల్లో ఇసుకను బుక్ చేసి చింతలపూడి, తెలంగాణ సరిహద్దు గ్రామాలకు వే బిల్లులు తీసుకుంటారు. లారీ లేదా ట్రాక్టర్ ద్వారా చింతలపూడి సరిహద్దు ప్రాంతాల్లోని మేడిశెట్టివారిగూడెం, సీతానగరం, లింగగూడెం మరికొన్ని గ్రామాల్లో అక్కడక్కడ ఐదారు లారీల ఇసుకను డంప్ చేసి అక్కడ నుంచి కొద్ది కిలోమీటర్లు దాటించి తెలంగాణకు అక్రమంగా రవాణా చేస్తున్నారు.

పరిమితికి మించి లోడింగ్

కొవ్వూరు నుంచి టన్ను ఇసుక చింతలపూడికి అయితే రూ.700, ఖమ్మం జిల్లా కల్లూరుకి రూ.1400, హైదరాబాద్‌కు రూ.3 వేలు రవాణా చార్జీతో కలిపి తీసుకుంటారు. ఒక్కొక్క లారీకి 20 టన్నులు, కొన్ని పెద్ద లారీలకు 30 టన్నులకు వేబిల్లు తీసుకుని ఆ మేరకు నగదు చెల్లిస్తారు. 20 టన్నుల లారీలో 40 టన్నులు, 30 టన్నుల లారీలో 60 నుంచి 70 టన్నులు లోడ్ చేసి భారీగా విక్రయిస్తున్నారు. సగటున చింతలపూడిలో 20 టన్నుల లారీ రూ.28 వేలు. అదే హైదరాబాద్‌కు అయితే లక్షకుపైగా వసూలు చేస్తున్నారు. కేవలం కొవ్వూరులోని రీచ్‌ల నుంచే అధికార పార్టీ అండదండలతో ఈ దందా సాగడం గమనార్హం. అది కూడా రెండు జిల్లాలు దాటించి సరిహద్దులో డంప్‌లు పెట్టి పొరుగు రాష్ట్రంలో విక్రయించడం చర్చనీయాంశంగా మారింది.

మూడు నెలలుగా ఈ తతంగం సాగుతుంటే ఈ నెల 4న పోలీస్, రెవెన్యూ, మైనింగ్ విభాగాలు కలిసి 15 లారీలు సీజ్ చేశారు. మళ్ళీ బుధవారం 6 లారీలు సీజ్ చేశారు. గత మూడు నెలల కాలంలో తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో వందకుపైగా ఇసుక అక్రమ రవాణా వాహనాలపై కేసులు నమోదు కావడం గమనార్హం.

ఏజెన్సీలో దంచికొట్టిన వర్షం



బుట్టాయగూడెం: కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు బుధవారం మధ్యాహ్నం కాస్త ఉపశమనం లభించింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉన్నప్పటికీ మధ్యాహ్నం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మి సుమారు రెండు గంటలు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంతకం ఫోర్జరీ

రూ.70 లక్షల నిధుల దుర్వినియోగం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంతకాన్ని ఫోర్జరీ చేసి 2019 నుంచి ఇంతవరకు దాదాపు రూ.70 లక్షల మేర నిధులు దుర్వినియోగంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. దీనికి కారకుడైన ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్‌ను సస్పెండ్ చేశారు. తాజాగా రూ.6 లక్షలు విత్‌డ్రా చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్సీ కార్పొరేషన్ నిధులను దుర్వినియోగం చేసినందుకు పవన్ కుమార్‌ను బుధవారం విధుల నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి సస్పెండ్ చేశారు. సొమ్ము దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు.

న్యూస్‌రీల్

అధినేతతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ఏలూరు సమన్వయకర్త జేపీ

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం, నియోజకవర్గంలో పార్టీ కమిటీల నియామకాలు, రాజకీయ పరిస్థితులను అధినేతకు వివరించారు.

వైఎస్సార్‌సీపీ వలంటీర్ల విభాగం అధ్యక్షురాలిగా పార్వతి



ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గానికి చెందిన మహిళా నేతకు జిల్లా పదవిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ వలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షురాలిగా భోగిశెట్టి పార్వతిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా పదవి కేటాయించటం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం కార్యదర్శిగా నీరజ



చింతలపూడి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా చింతలపూడి మండలానికి చెందిన మొలుగుమాటి నీరజా సుధాకర్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నీరజ ప్రస్తుతం చింతలపూడి జెడ్పీటీసీగా ఉన్నారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌కు ఎంపిక



పవన్‌కుమార్

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంకు చెందిన కర్సి పవన్‌కుమార్ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. నెల వ్యవధిలోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో 6 పతకాలను సాధించి అందరి చూపు తన వైపు తిప్పుకున్నాడు. గత నెల 9న విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 3 స్వర్ణ పతకాలను సాధించాడు. ఆగస్టు 29 నుంచి 31 వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ, రెండు రజత పతకాలు సాధించి అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. డిసెంబర్ 7 నుంచి దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటాడు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా ఐక్యవేదిక సభ్యులు జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి వై.దోసిరెడ్డికి నోటీసు అందజేశారు. ఇంటింటికీ తిరుగుతూ చేసే సర్వేల నుంచి విముక్తి కల్పించాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను వారి సంబంధిత మాతృశాఖలకే అనుసంధానం చేయాలని, సమయ పాలన లేకుండా ఆదివారాలు, పండుగలు, సెలవుల్లో కూడా విధులు చేయించడం నిలిపివేయాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఒకే క్యాడర్‌లో కొనసాగుతున్న ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. పారదర్శక బదిలీలు జరిగేలా ప్రత్యేక విధి విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు షేక్ ఉమర్ అలీషా, ఎం.వెంకటేష్, డి.స్వర్ణలత, కే ఆదిత్య, కే కళ్యాణి, టి.చాందిని తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్‌లో పోలవరం తహసీల్దార్!

- కిడ్నీ రోగికి అక్రమంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ
- బాధితురాలి ఫిర్యాదుతో వెలుగులోకి వాస్తవాలు

సాక్షి, అమరావతి: తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేయడం ద్వారా ఓ తహసీల్దార్ కిడ్నీ రాకెట్‌కు సహకరించినట్లు తేలింది. సరైన విచారణ లేకుండా సర్టిఫికెట్ జారీ చేసినట్లు నిర్ధారణ కావడంతో సంబంధిత వ్యవహారంపై పోలీసు కేసు నమోదైంది. దీనిపై అన్ని ఆధారాలతో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు అందినా ఆయనపై ఎలాంటి చర్య తీసుకోకుండా వదిలేశారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా పోలవరం తహసీల్దార్‌గా పనిచేస్తున్న బీఎస్‌వీఎస్ఆర్ఎల్ రాజు గతంలో నిడమర్రు తహసీల్దార్‌గా పని చేశారు. ఆ సమయంలో నిడమర్రుకు చెందిన యర్రంశెట్టి ఉదయ కిరణ్(కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వ్యక్తి) ఏలూరులో కూరగాయలు అమ్ముకుని జీవించే బూసి అనూరాధకు రూ.ఏడు లక్షలు ఇస్తామని ఆశ చూపి కిడ్నీ ఇవ్వాలని కోరాడు. దీనికి అనూరాధ అంగీకరించడంతో ఉదయ్ అక్రమ మార్గంలో బూసి అనూరాధ ఇంటి పేరును మార్చి తన భార్యగా పేర్కొంటూ ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశాడు. బూసి అనూరాధ ఆధార్ కార్డులో ఇంటి పేరును యర్రంశెట్టిగా మార్చాడు. దీంతో తహసీల్దార్ ఆధార్ కార్డు చూసి ఆమె ఉదయ్ భార్యేనని నిర్ధారించి ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేసేశారు. నిబంధనల ప్రకారం నిడమర్రులో విచారణ నిర్వహించి సర్టిఫికెట్ జారీ చేయాలి. డబ్బులు తీసుకుని విచారణ లేకుండా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేసినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ సర్టిఫికెట్ ఉపయోగించుకుని ఉదయ్ కిరణ్ తన భార్య అనూరాధ తనకు కిడ్నీ ఇస్తున్నట్లు చూపించి కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడు.

రూ.ఐదు లక్షలే ఇచ్చారు

పేదరికంలో ఉన్న అనూరాధ రూ.ఏడు లక్షలు ఇస్తామంటే ఆశపడి కిడ్నీ ఇచ్చేందుకు అంగీకరించింది. అయితే మధ్యవర్తి ప్రసాద్ ఆమెకు రూ.ఐదు లక్షలే ఇవ్వడం, కిడ్నీ మార్పిడి తర్వాత ఆమె అనారోగ్యం పాలైనా చికిత్స చేయించకపోవడంతో విషయం బయటపడింది. తనను మోసం చేసి కిడ్నీ తీసుకున్నారని, తనకు ఇస్తానన్న డబ్బులు ఇవ్వలేదని, ఆధార్ కార్డులో తనకు తెలియకుండా ఉదయ్ భార్యగా మార్పు చేశారని అనూరాధ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ అక్రమం జరగడానికి ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్ చట్టం, 1994 మార్గదర్శకాల ప్రకారం సరైన పరిశీలన, విచారణ లేకుండా డబ్బుల కోసం తహసీల్దార్ ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేయడమేనని స్పష్టమైంది. పోలీసు విచారణలోనూ తహసీల్దార్ తప్పు చేసినట్లు తేలింది. ఉన్నతాధికారులను మేనేజ్ చేయడం ద్వారా తహసీల్దార్ తనపై వచ్చిన ఫిర్యాదులన్నింటినీ బుట్టదాఖలు చేయించారనే ఆరోపణలున్నాయి. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లినా దీనిపై కనీస విచారణ జరపలేదు. అధికార పార్టీల ఎమ్మెల్యేలు, నేతలు, ప్రభుత్వం చెప్పిన కేసులకు సంబంధించి మాత్రమే సీసీఎల్ఏలో ఆగమేఘాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన ఎటువంటి ఫిర్యాదులైనా అటకెక్కుతున్నాయి.

కామినేని రౌడీలను పెంచి పోషిస్తున్నారు

- 'సేవ్ కైకలూరు' పేరుతో త్వరలో విశ్రాంత ఉద్యోగులతో కమిటీ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



కైకలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: పెంపుడు కొడుకుగా పేరొందిన రౌడీని కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పెంచి పోషించడంతో అరాచకశక్తిగా మారి, అల్లరి మూకలను తయారు చేశాడని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మండిపడ్డారు. కైకలూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 5న దానిగూడెం దళితవాడకు చెందిన ఇద్దరి యువకులపై కత్తులతో దాడి జరిగితే ఎమ్మెల్యే అనుచరులు తనపైనా, తన కుమారులపైనా దాడి కుట్రను ఆపాదించడం సిగ్గుచేటన్నారు. ప్రధాన నిందితుడిని అరెస్టు చేయకుండా ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. గొడవ జరిగిన వినాయక ఊరేగింపులో గంగానమ్మగుడి, సంతమార్కెట్, మసీదు సెంటర్, కొల్లేటికోటకు చెందిన అల్లరు మూకలు ఎందుకు ఊరేగింపునకు వచ్చారో ఆలోచించాలన్నారు. వారం రోజుల క్రితం వినాయక పందిరి వద్ద గొడవలో పోలీసులు చర్యలు తీసుకుంటే ఈ రోజు ఇంతటి దారుణం జరిగేది కాదన్నారు. ఎన్నికల్లో కలెక్షన్ల కోసం వచ్చి ఉంటున్నావారెవరనేది అందరికీ తెలుసన్నారు. రౌడీ మూకల అరచకాలకు అరికట్టడానికి నియోజకవర్గ స్థాయిలో అందరితో సంప్రదించి విశ్రాంత ఉద్యోగులతో ×సేవ్ కైకలూరు× పేరుతో కమిటీని ఏర్పాటు చేస్తానన్నారు.

పదవులు శాశ్వతం కాదు

పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, పార్టీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొమటి విష్ణువర్ధనరావు మాట్లాడుతూ ఎవరికీ పదవులు శాశ్వతం కాదన్నారు. ఎంపీపీలు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, చందన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి కార్యకర్తలు వైఎస్సార్‌సీపీని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఎస్సీ సెల్ నాయకుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, నాయకులు గోట్రూ ఏసుబాబు, మండల పార్టీ అధ్యక్షులు రాము, రామరాజు, నత్తగుళ్లపాడు సర్పంచ్ ముంగర కృష్ణంరాజు, నాయకులు సమయం అంజి, మడక శ్రీను పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దళితుల దాడిలో ప్రధాన నిందితుడు, అతడి అనుచరుల అరాచకాలను డీఎన్నార్ వెల్లడించారు. కైకలూరు గాంధీబొమ్మ సెంటర్‌లో టీడీపీ ఆర్యవైశ్య డైరెక్టర్ మల్యాద్రి దుకాణంపై మూకుమ్మడి దాడి, సంత మార్కెట్ వద్ద బ్యాటరీ నాయుడు దుకాణంపై దాడి, ఏలూరు రోడ్డు వద్ద చికెన్ దుకాణంపై, చింతపాడు వద్ద వడ్డి సామాజికవర్గ బృందంపై, పోలీసుస్టేషన్ ఎదుటే ఆర్యవైశ్య కిషోర్ దంపతులపై కాల్‌మనీ కేసులో దాడి చేశారన్నారు. అన్న క్యాంటీన్‌లో పేదలపై దాడి, వెలంపేటలో కాపు సామాజికవర్గానికి చెందిన గుర్రం అరవింద్‌పై దాడి, భుజబలపట్నంలో దళితవర్గానికి చెందిన విలేకరి కుర్రేళ్ల కిషోర్‌పై దాడి, బైపాస్ రోడ్డులో విశ్రాంత రైల్వే ఉద్యోగిపై, డబ్బులు అడిగినందుకు సంత మార్కెట్ వద్ద ఫ్లెక్సీ ప్రింటర్‌పై దాడి వంటి ఘటనలు ఉదహరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలు

కాలువ మట్టి తవ్వకుండా తవ్వారంటూ అధికారుల వేధింపులు



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన వాహనాలు

ద్వారకాతిరుమల: కూటమి నేతల అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు రోజురోజుకు పెచ్చు మీరుతున్నాయి. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి పంచాయతీ, తక్కెళ్లపాడులో ఇద్దరు వైఎస్సార్ సీపీ నాయకులపై బుధవారం కూటమి నేతలు కక్ష సాధింపు చర్యలకు దిగారు. పొలం పనులు చేసుకుంటున్న వారిని కాలువ మట్టి తవ్వారంటూ వారి జేసీబీ, ట్రాక్టర్‌ను అధికారుల చేత సీజ్ చేయించారు. స్థానికుల క నం ప్రకారం. తక్కెళ్లపాడులో దామోదరరెడ్డికి చెందిన ఆయిల్‌పామ్ తోటలోకి ఉదయం 10 గంటల నుంచి, సత్తాలకు చెందిన వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు కుంచే రాజేష్ ట్రాక్టర్ ఎరువు (పేడ)ను తోలుతోంది. ఎరువు లోడింగ్, ఇతర పొలం పనులకు తక్కెళ్లపాడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముల్లంగి నీలకంఠరెడ్డి జేసీబీ పనిచేస్తోంది. మధ్యాహ్నం సమయంలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, పోలవరం కాలువ అధికారులు, పోలీస్ సిబ్బంది దామోదరరెడ్డి తోటకు 300 మీటర్ల దూరంలో ఉన్న పోలవరం కుడి కాలువ గట్టు వద్దకు వచ్చారు. అక్కడ మట్టి తవ్విన పాత ఆనవాలును చూసి, అది నీలకంఠరెడ్డి, రాజేష్‌లే తవ్వారని ఆరోపించారు. అయితే వారి జేసీబీ, ట్రాక్టర్ ఘటనా స్థలంలో లేవు. అయినా వారే తవ్వారంటూ అధికారులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న నీలకంఠరెడ్డి, రాజేష్‌లు అధికారులను కలసి తమకు సంబంధం లేదని, తమ వాహనాలను పొలం పనులకు పెట్టామని చెప్పినా అధికారులు వినిపించుకోలేదు. మాకు ఒత్తిళ్లు వస్తున్నాయి. వాహనాలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిందేనని తెగేసి చెప్పారని బాధితులు వాపోయారు. కూటమి నేతల అక్రమ తవ్వకాలను తమపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వారి వాహనాలను రాత్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీఆర్వో మీడియాతో మాట్లాడుతూ పోలవరం కాలువ పక్కన మట్టి తవ్వేసి ఉందని పై నుంచి ఫోన్‌లు వస్తే ఇక్కడికి వచ్చామని చెప్పారు.

వృద్ధులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): వయో వృద్ధులను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో వయో వృద్ధుల చట్టం నిబంధనలపై జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయో వృద్ధుల సంరక్షణకు చట్టాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వృద్ధుల సమస్యలను పరిష్కరించే దిశగా వృద్ధులకు రక్షణ కల్పించేందుకు పోలీస్ శాఖలో నోడల్ అధికారిని నియమించాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో వాలంటీర్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్స్ కేసులకు సంబంధించి డివిజన్ స్థాయిలో 642 క్లెయిమ్స్ అందగా వాటిలో ఇంతవరకు 515 పరిష్కరించామన్నారు. అక్టోబరు 1న వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 21 నుంచి 30 వరకు వివిధ పోటీలు, వైద్య శిబిరాలు, కుటుంబ సంబంధిత కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, అందరికీ ఇళ్ల పరిశీలన కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే 175 మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి రూ.160.25 కోట్లతో మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణాలపై ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించేందుకు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి పరిశీలన కమిటీ ఆమోదించింది.

ఆక్వా వివరాలు పొందుపర్చాలి : జిల్లాలో ఆక్వా సాగు చేసే చెరువుల వివరాలను విలేజ్ ఆక్వా కల్చర్ యాప్‌లో పొందుపరచాలని కలెక్టర్ వెట్రిసెల్వి మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి విలేజ్ ఆక్వాకల్చర్ యాప్‌లో చెరువుల వివరాల నమోదుపై మత్స్య శాఖాధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

78,145 టన్నుల ఎరువుల పంపిణీ

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇంతవరకు 78,145 టన్నుల ఎరువులు అందించామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. సెప్టెంబర్ 11 నుంచి 13 మధ్య మరో 1,614 టన్నుల యూరియా జిల్లాకు రానుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1873 టన్నుల యూరియా, 2,952 టన్నుల డీఏపి, 4,437 టన్నుల ఎంఓపీ, 12,903 టన్నుల ఎన్‌పీకే, 665 టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులు ఉన్నాయన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో సభ్యుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విశ్వమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఐదుగురు సభ్యులు, ఓసీ, వెనుకబడిన కులాలకు చెందిన ముగ్గురు సభ్యుల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నామని, దరఖాస్తుదారులు జిల్లా వాసులై ఉండాలని, వారి వివరాలతో పాటు సామాజిక కార్యకర్తలుగా అనుభవం, సాధించిన విజయాలు బయోడేటాతో జతపర్చాలన్నారు. దరఖాస్తులను ఎస్సీ సంక్షేమం–సాధికారత అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ, అమీనాపేట కార్యాలయంలో ఈ నెల 30లోగా అందజేయాలన్నారు.

బిల్లుల పెండింగ్‌పై కాంట్రాక్టర్ల బెంగ



భీమవరంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మున్సిపాలిటీకి సంబంధించి గత ప్రభుత్వం ఎన్నికల ముందు దాదాపు 90 శాతం బిల్లులు క్లియర్ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన పనులకు సంబంధించిన బిల్లులు సీఎఫ్ఎంఎస్‌కు పంపగా ఈ ఏడాది మార్చి 31న క్యాన్సిల్ చేశారు. అప్పటి నుంచి కాంట్రాక్టర్లకు పైసా బిల్లు అందలేదు. పలుమార్లు ఉన్నతాధికారులు, మున్సిపల్ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. బుధవారం భీమవరంలో మున్సిపల్ కాంట్రాక్టర్లు మాట్లాడుతూ బిల్లులు అందక పడుతున్న ఇబ్బంది పడుతున్నామన్నారు. మార్చి 31న సీఎఫ్ఎంఎస్‌లో ఉన్న బిల్లుల్ని క్యాన్సిల్ చేశారని, నిధి పోర్టల్ తీసుకొచ్చి బిల్లులు అప్‌లోడ్ చేసుకోమన్నారు. ఏప్రిల్ 19 వరకూ బిల్లులు అప్‌లోడ్ చేశామని, ఆగస్టు 21 వరకూ భీమవరం మున్సిపాలిటీకి సంబంధించి సుమారు రూ.9 కోట్ల మేర 60 బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. ఆ తర్వాత గ్రీన్ చానల్లో బిల్లులు అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కొత్తగా ప్రతి నెలా 11 నుంచి 20 మధ్య బిల్లులు పెట్టుకోవాలని కమిషనర్లకు చెప్పారన్నారు. ఈనెల 4 నుంచి కొత్తగా అప్‌లోడ్ చేసిన బిల్లులకు పేమెంట్లు చేశారు. గత 15 నెలలుగా పెండింగ్ ఉన్న బిల్లులకు సంబంధించి ఎలాంటి పేమెంట్లు చేయకపోగా 4న అప్‌లోడ్ చేసిన బిల్లులు ఇవ్వడంతో వారు వాపోతున్నారు. ఒక్కొక్కరికి రూ.40 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకూ బిల్లులు బకాయిలు ఉన్నాయన్నారు. అటు జనరల్ ఫండ్ నుంచి గాని, ఇటు కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఫండ్స్ నుంచి గాని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం

డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛంద సంస్థలు సమాజానికి అందిస్తున్న సేవలు విశేషమైనవని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు, బాలలకు న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే కార్యకలాపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు సమాజానికి అందిస్తున్న సేవలు విశేషమైనవని న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయసేవలపై అవగాహన కల్పించడంతో ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్య చక్రవేణి, సీడీపీఓ తులసి, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ నీటి సరఫరా అధికారిగా శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా గ్రామీణ నీటి సరఫరా జిల్లా అధికారిగా కె.శ్రీనివాస్ నియమితులయ్యారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలని ఆదేశించారు. ఆయన ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తూ పదోన్నతిపై జిల్లాకు వచ్చారు.

క్లుప్తంగా

కేవీకే హెడ్ సైంటిస్ట్‌కు అవార్డు



మల్లికార్జునరావు (ఫైల్)

ఉండి: ఏరువాక ఉత్తమ శాస్త్రవేత్త అవార్డుకు ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు ఎంపికయ్యారు. ఏరువాక ఫౌండేషన్ ఏటా వ్యవసాయ అనుబంధ రంగాల్లోని వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే శాస్త్రవేత్తలను ఎంపిక చేసి అవార్డులు అందజేస్తుంది. దీనిలో భాగంగా 2023-24కి గాను ఉత్తమ విస్తరణ నిపుణుడు ఎంటొమోలోజీ విభాగంలో డాక్టర్ మల్లిఖార్జునను ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపిక చేశారు. ఈమేరకు ఫౌండేషన్ నుంచి తనకు సమాచారం అందినట్లు మల్లిఖార్జునరావు తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు కేఎల్ యూనివర్సిటీలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఆర్అండ్‌డీ థియేటర్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డు అందజేస్తారని ఆయన చెప్పారు.

ఎరువుల దుకాణంపై కేసు



బొర్రంపాలెంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

టి.నరసాపురం: బొర్రంపాలెం అన్నపూర్ణ ఫెర్టిలైజర్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో బుధవారం విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. షాపులో ఆయా ఎరువులు ఉండాల్సిన దానికన్నా 3.245 టన్నులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. రూ.6,98,663 విలువ కలిగిన యూరియా, పొటాష్, 10-26, సూపర్ 39.585 టన్నులను సీజ్ చేశారు. షాప్ యజమాని అశోక్ కుమార్‌పై 6 ఏ కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై రంజిత్ కుమార్, విజిలెన్స్ ఏవో మీరయ్య, మండల వ్యవసాయ అధికారిణి బి.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి మిద్దెతోటల పెంపకంపై శిక్షణ

ఉండి: ఈ నెల 17వ తేదీ నుంచి ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో మిద్దెతోటల పెంపకంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిద్దెతోటల పెంపకంతో పాటు తేనెటీగలు, కోళ్లు, చేపల పెంపకం, బయోడీకంపోజర్స్ వినియోగం తయారీపై సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మిద్దెతోటల పెంపకం నిపుణుడు వేణుగోపాలరావు తదితర జిల్లా మండల అధికారులు హాజరువుతారని తెలిపారు. మిద్దెతోటలు తదితర వాటిపై అవగాహన, శిక్షణకు ఆసక్తి గల మహిళలు హాజరు కావాలని కోరారు.

జిల్లా జట్ల ఎంపిక



కరాటేలో తలపడుతున్న బాలికలు

పెదవేగి : ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఉత్సాహంగా జరిగాయి. ఫెన్సింగ్ జూడో, బాక్సింగ్, బీచ్ వాలీబాల్, రగ్బీ, తైక్వాండో, గక్కా క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు డీవైఈఓ టి శేఖర్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె జయరాజు తెలిపారు. ఈ పోటీల్లో కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ శివప్రసాద్, ఇతర పీడీలు పాల్గొన్నారు.



భావ ప్రకటన స్వేచ్ఛను అణగదొక్కుతారా?



దేశంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టుల భావ ప్రకటన స్వేచ్ఛను అణగదొక్కటం, భయభ్రాంతులకు గురి చేయటం సరైంది కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరూ అడ్డు ఉండకూడదు, విమర్శించకూడదు అనే భావన నిరంకుశత్వానికి నిదర్శనం. జర్నలిస్టుల హక్కులను కాలరాయటం అభ్యంతరకరం. చట్టసంస్థలు స్పందించాలి, శాశ్వత పరిష్కారం చూపాలి. పత్రికా రంగ హక్కులను, విలువలను పరిరక్షించాలి.

– ముదుగురు సూర్యనారాయణ, రిటైర్డ్ లెక్చరర్, కొత్తూరు, పెదపాడు మండలం

పత్రికా స్వేచ్ఛకు తీవ్ర భంగం



పత్రికలు ప్రజల గొంతుకుగా సమాజంలో అన్యాయాలపై ప్రశ్నిస్తాయి. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర భంగం కలుగుతోంది. మీడియాలో ఎడిటర్ స్థాయి వ్యక్తులపై కేసులు నమోదు చేయడం అన్యాయం. సాక్షి ఎలక్ట్రానిక్ మీడియాలో కెమెరామెన్‌ల మీద కూడా పోలీసులు కేసులు నమోదుకు ఉపక్రమిస్తున్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ ఇటువంటి ఘటనలను ఖండించాలి.

– బీవీ రావు, వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం, రాష్ట్ర కార్యదర్శి, కైకలూరు

పశువుల్లో 'లంపీ'తో అప్రమత్తం

- శ్రీవారి క్షేత్రంలో తాత్కాలికంగా గోదానం, గోదత్తత నిలుపుదల
- గోసంరక్షణ శాలలో పశువులకు టీకాలు





గోసంరక్షణశాలలోని షెడ్డులో ఉన్న ఆవులు , గోసంరక్షణశాలలో లంపీ స్కిన్ వ్యాధి నుంచి కోలుకున్న ఆవుదూడ

ద్వారకాతిరుమల : పశువులకు ముద్దచర్మ (లంపీ స్కిన్) వ్యాధి వ్యాపిస్తుండటంతో శ్రీవారి దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే గోదానం, గోదత్తత పథకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ప్రస్తుతం గోసంరక్షణశాలలో మొత్తం 326 పశువులు ఉన్నాయి. పశువైద్యాధికారులు ఇప్పటికే వాటన్నిటికి లంపీ స్కిన్ వ్యాధి నివారణా టీకాలు వేశారు. అయితే ఇటీవల ఓ భక్తుడు ఆవు, దూడను దానంగా ఇవ్వగా అందులో దూడకు లంపీ స్కిన్ వ్యాధి ఉన్నట్లు గుర్తించిన వైద్యులు, దానికి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆ దూడ కోలుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో గోదానాన్ని స్వీకరిస్తే గోసంరక్షణశాలలోని అన్ని గోవులకు ఆ వ్యాధి సోకే ప్రమాదం ఉందని పశువైద్యులు దేవస్థానం అధికారులకు సూచించారు. దాంతో గోదానం, గోదత్తతను ఈనెల 6 నుంచి తాత్కాలికంగా నిలిపివేశారు.

ప్రతిష్టాత్మకంగా గోసంరక్షణ

గోదానం ఎంతో విశిష్టమైనదిగా ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే భక్తులు శ్రీవారికి గోవులను దానంగా ఇస్తుంటారు. వాటిలో కొన్నింటిని దేవస్థానం రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం దత్తత ఇస్తోంది. ముందుగా దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రతినెలా రెండవ, నాల్గవ శనివారాల్లో ఆవులను దత్తత ఇస్తున్నారు. ఏడాదిలో ఒకసారి దేవస్థానం అధికారులు రైతుల వద్దకు వెళ్లి వారిచ్చిన గోవులను పరిశీలిస్తున్నారు. అలాగే గోసంరక్షణశాలలో ఉన్న గోవుల పోషణపట్ల అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

తెల్ల పశువుల్లోనే వ్యాధి తీవ్రత

తెల్ల పశువులు అయిన ఆవులు, ఎద్దుల్లోనే ఎక్కువగా ఈ వ్యాధి తీవ్రత కనిపిస్తుంది. లంపీ స్కిన్ అనే వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధి పశువుల రక్తం పీల్చే దోమలు, ఈగలు, పిడుదుల ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు సులభంగా వ్యాపిస్తుంది. అది కూడా అక్టోబర్ నుంచి జనవరి మధ్యలోనే ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. అందుకే పశువైద్యాధికారులు, సిబ్బంది గోసంరక్షణ శాలలోని గోవులకు సెప్టెంబర్‌లోనే టీకాలు వేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా ముందుగానే టీకాలు వేయించాలి. 104 నుంచి 106 డిగ్రీల జ్వరం వచ్చి, చర్మంపై బొబ్బలు, బుడిపెలు, పొక్కులు ఏర్పడి, నెమ్మదిగా అవి పగిలి పుండ్లుగా మారి, మేత సరిగ్గా తినకపోవడం, నోరు, ముక్కు నుంచి చొంగ కారడం, పాల దిగుబడి తగ్గడం, అలసటగా ఉండటం వంటి లక్షణాలు ఉంటే దాన్ని లంపీ స్కిన్ వ్యాధిగా గుర్తించాలి. వాటిని మంద నుంచి వేరు చేసి, చికిత్స అందించాలి. దోమ తెరలు, లేదా వేపాకు పొగ వేయాలి. గంజి వంటి ఆహార పదార్థాల్లో కాస్త ఉప్పు కలిపి తాగించాలి. జ్వరం తగ్గే వరకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఇవ్వాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికామ్, ఆనాల్జిన్ మందులను వైద్యుల సూచనల మేరకు వాడాలి. సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉంటే యాంటీ బయాటిక్, న్యూమోనియా లక్షణాలు ఉంటే అవిల్, సీపీఎం వంటి మందులు వాడాలని పశువైద్యులు తెలిపారు. వ్యాధి పూర్తిగా తగ్గిన ఆవులనే దానంగా ఇవ్వాలి.

నెల క్రితమే టీకాలు వేశాం



శ్రీవారి గోసంరక్షణశాల లోని ఆవులకు, గిత్తలకు, దూడలకు నెల క్రితమే లంపీ స్కిన్ వ్యాధి నివారణా టీకాలు వేశాం. బయట నుంచి కొత్తగా పశువులు లోపలికి వస్తే ప్రస్తుతం ఉన్న ఆవులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అందుకే కొత్త వాటిని రాకుండా చూడాలని ఆలయ అధికారులకు సూచించాం. వారు వెంటనే అప్రమత్తమై గోదానం, గోదత్తతను నిలిపివేశారు.

– అంగర సురేష్, పశువైద్యాధికారి, ద్వారకాతిరుమల

వ్యాధి తీవ్రత తగ్గిన తరువాతే



లంపీ స్కిన్ వ్యాధి విస్తరిస్తున్న నేపధ్యంలో పశువైద్యాధికారుల సూచనల మేరకు భక్తుల నుంచి గోవులను దానంగా తీసుకోవడం, అలాగే రైతులకు గోవులను దత్తత ఇవ్వడాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశాం. వ్యాధి తీవ్రత తగ్గిన తరువాత మళ్లీ వాటిని పునఃప్రారంభిస్తాం. ఆ సమాచారాన్ని ముందుగా మీడియా ద్వారా అందరికీ తెలియజేస్తాం.

– ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, శ్రీవారి దేవస్థానం ఈఓ

15న కృష్ణాష్టమి వేడుకలు



గోసంరక్షణశాల వద్ద కొలువైన శ్రీకృష్ణుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈనెల 15 న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అందులో భాగంగా ఆరోజు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే 16న సాయంత్రం క్షేత్రంలో ఉట్ల పండుగ, శ్రీవారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులు గమనించాలని ఆయన కోరారు.

ఎన్ఎంఆర్ కార్మికులకు వేతనాల పెంపు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎన్ఎంఆర్ కార్మికులకు 2025 -26 సంవత్సరానికి వేతనాల పెంపును ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఒక రోజుకి స్కిల్డ్ కార్మికునికి రూ.710 నుంచి రూ.730, సెమీ స్కిల్డ్ కార్మికునికి రూ.640 నుంచి రూ.665, అన్‌స్కిల్డ్ కార్మికునికి రూ.595 నుంచి రూ.615గా నిర్ణయించారని, ఈ వేతనాలు ఏప్రిల్ 01, 2025 నుంచి అమలులోకి వస్తాయన్నారు.

జీవితంలో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి



ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సైకియాట్రిస్టు డాక్టర్ కోమలి

ఎన్‌సీడీ జేడీ డాక్టర్ నర్సింగరావు

నూజివీడు: జీవితంలో సవాళ్లను, సమస్యలను ఎదుర్కొనడానికి విద్యార్థి దశ నుంచే ధైర్యంతో సిద్ధంగా ఉండాలని ఎన్‌సీడీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జీ నర్సింగరావు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంను పురస్కరించుకొని విద్యాసంస్థల్లో ఆత్మహత్యల్ని నివారించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ సూచనల మేరకు పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేడీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల వల్ల ఒత్తిడి పెరిగిపోయి వాటి నుంచి తట్టుకోలేక ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. విద్యార్థిపై ఎవరూ ఒత్తిడి చేయకూడదని, వారికిష్టమైన సబ్జెక్టును చదువుకునే స్వేచ్ఛ విద్యార్థికి ఇవ్వాలన్నారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని బట్టి వారిలో ధైర్యాన్ని నిరంతరం నింపుతూ ఉండాలన్నారు. ఎవరి జీవితం వడ్డించిన విస్తరి కాదని, చిన్న చిన్న కారణాలకే జీవితాన్ని చాలించాలనుకోవడం అవివేకమన్నారు. ఒక తలుపు మూసుకుపోతే, మరో తలుపు తెరిచే ఉంటుందన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. నిరంతరం పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగాలని, నిరాశ నిస్పృహలను దరిచేరనీయవద్దన్నారు.

నేనున్నాను అనే భరోసా ఇవ్వాలి

సైకియాట్రిస్టు డాక్టర్ కోమలి మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకోవడం నేరమని, అలాంటి ఆలోచన వచ్చిన వాళ్లను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్ల ప్రవర్తన వేరుగా ఉంటుందని, ఒక్కరే కూర్చోవడం, ఏడవడం, ఒంటరితనం, ఎవరూ లేరని బాధపడడం, మన బాధ వినేవారు ఎవరూ లేరని బాధపడడం అనే లక్షణాలతో బాధపడుతుంటారన్నారు. అలాంటి వాళ్లని గుర్తించి ప్రేమగా పలకరించాలని, నీకు నేనున్నాను అనే భరోసా ఇవ్వాలన్నారు. అనంతరం హాజరైన విద్యార్థులతో ఆత్మహత్యా నివారణా ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో నూజివీడు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.జాస్తి జగన్మోహనరావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, సైకాలజిస్ట్ కె.శ్రీనివాసరావు, ట్రిపుల్ ఐటీ సైకాలజీ అధ్యాపకుడు వేణుగోపాల్, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ రాజేష్, చీఫ్ వార్డెన్‌లు సురేష్ బాబు, గౌతమి, పీయూసీ కోఆర్డినేటర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసమే హత్య

వ్యక్తి దారుణ హత్యలో ఆరుగురు నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ కొమడవోలు ఇందిరమ్మ కాలనీలో ఇటీవల జరిగిన దారుణ హత్య కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ బుధవారం ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కొమడవోలు ఇందిరమ్మ కాలనీకి చెందిన పూనూరు రాజేష్ కొందరు రాజకీయ నేతల అండతో గొడవలకు సెటిల్‌మెంట్లు చేస్తూ ఉంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన బూరగ నాని అలియాస్ చిన్న నాని మృతుడితో సన్నిహితంగా మెలిగేవాడు. కానీ కొన్ని సందర్భాల్లో రాజేష్ కఠినంగా ప్రవర్తిస్తూ చిన్న నానిని మందలించటం... కొట్టటం చేసేవాడు. రాజేష్‌కు తెలిసిన ఒక మహిళతో నాని చనువుగా ఉండటాన్ని గమనించిన ఆమె బంధువులు గతంలో నానితో గొడవపడి కొట్టారు. దీనిలోనూ రాజేష్ కీలకపాత్ర పోషించాడని నాని మనసులో కక్ష పెంచుకున్నాడు. పైగా ఇందిరమ్మ కాలనీలో సెటిల్‌మెంట్లు చేస్తున్న రాజేష్ లేకుంటే... తానే పెద్దమనిషిగా చలామణి అవ్వచ్చు అనే ఆలోచనతో రాజేష్‌ను చంపేందుకు తన స్నేహితులతో కలిసి పక్కా స్కెచ్ వేశాడు.

కత్తులతో దాడి చేసి..

ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ఆగస్టు 31 తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇందిరమ్మ కాలనీలో రాజేష్ తన ఇంట్లో ఉండగా బూరగ నాని అతని ఇంటికి వెళ్లి బయటకు రావాలని పిలిచాడు. చర్చి సమీపంలోకి తీసుకువెళ్లి నాని, మరో ఐదుగురు కత్తులతో దాడి చేసి కారులో పరారయ్యారు. ఈలోగా అరుపులు, కేకలకు రాజేష్ కుమార్తె, కుమారుడు, చెల్లి బయటకు వచ్చి చూడగా తీవ్ర గాయాలతో ఉన్నాడు. కుటుంబ సభ్యులు అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదుపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసును ఛేదించిన పోలీసులు

ఈ కేసు విచారణకు సంబంధించి ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ, ఏలూరు టూటౌన్ సీఐ కే.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 10న ఏలూరు జాతీయ రహదారిపై రత్నాస్ రెస్టారెంట్ వెనుక నిందితులు ఉన్నారనే సమాచారంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఇన్‌చార్జి ఎస్సై నాగబాబు, సిబ్బంది కలిసి ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి స్కూటీ, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు వీరే..

ఏలూరు రూరల్ ఇందిరమ్మ కాలనీకి చెందిన ప్రధాన నిందితుడు బూరగనాని అలియాస్ చిన్న నానితోపాటు, ఏలూరులోని వివిధ ప్రాంతాలకు చెందిన సామంతుల అజయ్‌సూర్య అలియాస్ బెన్నీ, లంకపల్లి బాలకృష్ణ అలియాస్ బాలు, సిగిరెడ్డి సుధాకర్ అలియాస్ సుధా, ఉగ్గిన షణ్ముక వేణుగోపాల్ అలియాస్ వేణు, కటారి పూర్ణచంద్ర శేఖర్ అనే ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురిపై ఏలూరు నగరంలో పాత కేసులు ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన సీఐలు సత్యనారాయణ, అశోక్‌కుమార్, ఎస్సై నాగబాబు, ఏఎస్సై సురేష్, హెచ్‌సీ సత్యారావు, కానిస్టేబుళ్లు బీ.నాగార్జున, ఆర్.మోహన్, పీ.నాగరాజు, ఎండీ రుహుల్లా, ఎన్.శేషుకుమార్‌ను ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

మన్యంలో ప్రకృతి సేద్యం



ముద్దప్పగూడెంలో కషాయాలు తయారు చేస్తున్న గిరిజన రైతులు

- 10 వేల ఎకరాల్లో రసాయన రహిత సాగు
- స్వయంగా కషాయాలు తయారు చేస్తున్న గిరిజన రైతులు

బుట్టాయగూడెం: రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో వ్యవసాయం భారంగా మారుతోంది. మిత్ర పురుగుల నాశనంతో చీడపీడల బెడద పెరుగుతుంది. దీనితో అధికారుల ప్రోత్సాహంతో తక్కువ పెట్టుబడి కలిగిన ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మన్యంలో ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు ఐటీడీఏ, ప్రకృతి వ్యవసాయ రైతులు అవగాహన కలిగిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1,596 మందికి పైగా ప్రకృతి వ్యవసాయం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రకృతి సాగులో పంటలు

కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాలతోపాటు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో గిరిజనులు సుమారు 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము పంటలతోపాటు జీడిమామిడి, అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయల పంటలను ప్రకృతి వ్యవసాయంగా సాగు చేసి పండిస్తున్నారు. వీటిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల పరిధిలో 4 వేల ఎకరాల్లో జీడిమామిడి, 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 270 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో మిర్చి, 250 ఎకరాల్లో మినుము, 280 ఎకరాల్లో కూరగాయలు, 3 వేల ఎకరాల్లో చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.

స్వయంగా కషాయాల తయారీ

ప్రకృతి వ్యవసాయ పంటలకు కషాయాలను స్వయంగా గిరిజన రైతులు తయారు చేసుకుంటున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులుగా పంటలకు జీవామృతం, ఘనామృతం, బీజామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి రసాయనాలను గిరిజన రైతులు స్వయంగా తయారు చేసుకుని పంటలకు వినియోగించుకుంటున్నారు.

ప్రకృతి సేద్యం పెంపునకు కృషి



గిరిజన ప్రాంతంలో ప్రకృతి సాగు పెంపునకు కృషి చేస్తున్నాం. వరి, మొక్కజొన్న, జీడిమామిడి, ప్రత్తితోపాటు కూరగాయల సాగును, ఎక్కువగా చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– నక్కా శ్రీను, సీఆర్‌పీ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

ప్రకృతి వ్యవసాయం బాగుంది



ప్రకృతి వ్యవసాయం చాలా బాగుంది. ముఖ్యంగా కూరగాయల సాగుతో అధిక లాభాలు సాధిస్తున్నాం. పండించిన కూరగాయలు, ఆకుకూరలను ఎప్పటికప్పుడు విక్రయిస్తున్నాం. ప్రజలు కూడా అధికంగా కొనుగోలు చేస్తున్నారు.

– కుమార్‌బాబు, సీఆర్‌పీ, సీతప్పగూడెం, బుట్టాయగూడెం మండలం